క్లుప్తంగా

యజమానులకు నోటీసులు

తానూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా లైసెన్సు తీసుకుని రెన్యూవల్ చేయని వారికి బుధవారం నోటీసులు అందించినట్లు పంచాయతీ కార్యదర్శి జలాల్ సింగ్ తెలిపారు. యజమానులు తమ షాపుల లైసెన్సులను రెన్యూవల్ చేయకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

వార్డులు పరిశీలన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్, సోమవార్‌పేట్, నాయుడివాడ, బెస్తర్‌పేట్, బంగల్‌పేట్ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంత్రి ఐకేరెడ్డి కృషితో పట్టణంలోని 42 వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. వారి వెంట హరిభువన్, టీపీఎస్ నవీన్, కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, మేడారం అపర్ణ-ప్రదీప్, నవీన్, కాంట్రాక్టర్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

భైంసారూరల్: అంబేద్కర్ విగ్రహాన్ని అవమాన పరిచిన నిందితులను కఠినంగా శిక్షించాలని సర్పంచ్ వినోద్ అన్నారు. బుధవారం మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల లోకేశ్వరం మండలం బామ్ని(కె)లో అంబేద్కర్ విగ్రహంపై పేడ చల్లి అవమానపరిచిన వారిని గుర్తించి శిక్షించాలన్నారు. గజ్జారాం, రతన్, దీక్షిత్, చరణ్, మనోజ్, చాంద్, దీపక్, సాయినాథ్, గంగాధర్, యశ్వంత్, బాబు, సాగరబాయి, సంగీత తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర, వట్టోలి, జోహర్‌పూర్ గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై డీపీఆర్‌వో ఆధ్వర్యంలో టీఎస్ఎస్ కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. అతిసారం, మూఢనమ్మకాలు, పరిశుభ్రతపై నాటికలు ప్రదర్శించారు. కళాబృందం సభ్యులు లక్ష్మణ్, రాజ్‌కుమార్, తస్లీమా, మాధవి, సుదర్శన్, సర్పంచ్‌లు రజిత, భోజవ్వ ఉన్నారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి



రాజూరలో మాట్లాడుతున్న రమేశ్

లోకేశ్వరం: మున్నూకాపు సంఘం బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు రోల్ల రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని రాజూర గ్రామంలో మున్నూరుకాపు సంఘం మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ సభ్యులు సంఘటితంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సంఘం మండలాధ్యక్షుడు మందలింగన్న, సభ్యులు దేవన్న, రాజేశ్వర్, శ్రీధర్, గంగాధర్, రవి, లింగన్న, సాయన్న ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

దస్తురాబాద్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఇన్‌చార్జి ఎంఈవో మధుసూదనాచారి సూచించారు. బుధవారం మండలంలోని ఆకొండపేట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అనుమతుల్లేకుండా ఇసుక, మొరం తరలించొద్దు

ముధోల్: అనుమతుల్లేకుండా ఇసుక, మొరం తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్యాంసుందర్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనుమతి లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఇసుక, మొరం తీసి రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక, మొరం సరఫరా చేసేవారు రెవెన్యూ సిబ్బంది వద్ద ఆయా గ్రామపంచాయతీల్లో రశీదులు పొందాలని సూచించారు.

లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఇప్పటివరకు లైఫ్ సర్టిఫికెట్ అందజేయని విశ్రాంత ఉద్యోగులు.. ఈనెల 31లోపు జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో అందజేయాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. లేకుంటే ఏప్రిల్ నెల పెన్షన్ నిలిపివేస్తారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణ్‌గార్ పండుగ

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లో బుధవారం మార్వాడీల ఆధ్వర్యంలో గణ్‌గార్ పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా హోలీ తరువాత 16రోజుల పండుగ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మహిళలు దేవతా ప్రతిమలను వీధుల గుండా రాధాకృష్ణభవన్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఇళ్లలో శివపార్వతులకు పూజలు చేశారు.

ప్రమాదకరంగా వంతెనలు

- భయాందోళనల మధ్య రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



జామ్ నుంచి మహవీర్‌తండా వెళ్లే మార్గంలో రక్షణ గోడలు లేని వంతెన

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులపై ఉన్న వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతోపాటు వంతెనల వద్ద రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు జంకుతున్నారు. అధికారులు, పాలకులు సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

మండలంలో..

మండలంలో 32 గ్రామపంచాయతీలున్నాయి. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో 1135 కల్వర్టులు, 12 పెద్ద వంతెనలు, 12 చిన్న వంతెనలు, ఆరు ప్రధాన వంతెనలు, రెండు ప్రధాన కల్వర్టులు ఉన్నాయి. ఇందులో మూడు కల్వర్టులు, మూడు వంతెనలు ప్రమాదకరంగా మారాయి. కొన్నిచోట్ల స్వల్ప ముప్పు పొంచి ఉంది.

నాలుగేళ్లుగా మరమ్మతులు కరువు..

మండలంలోని జామ్ పంచాయతీ పరిధిలోని మహవీర్ తండా గ్రామానికి వెళ్లే మార్గంలో వాగుపై నిర్మించిన వంతెన వద్ద రోడ్డు ఇరువైపులా కోతకు గురైంది. కోతకు గురై నాలుగేళ్లు గడుస్తున్నా.. ఎవరూ మరమ్మతులు చేయించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో ఓ ఎడ్లబండి అదుపుతప్పి వంతెనపై నుంచి కాల్వలో పడిపోయింది. ఈ ఘటనలో ఎడ్లు, బండిపై ఉన్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డారు. మరో ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు వంతెన వద్ద అదుపు తప్పి కిందపడగా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ వంతెనపై రాకపోకలకు సాగించేందుకు తండావాసులు ఆందోళన చెందుతున్నారు.

రక్షణ గోడలు లేక..



బోరింగ్‌తండా వెళ్లే మార్గంలో వంతెనపై నుంచి కాల్వలో పడిపోయిన ఎడ్లబండి(ఫైల్)

జామ్ పంచాయతీ పరిధిలోని బోరింగ్‌తండా, లక్ష్మీపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై జామ్ సమీపంలో స్వర్ణ ప్రాజెక్టు ఎడమ కాలువపై నిర్మించిన వంతెనకు రెండువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి ఈమార్గంలో వెళ్లేవారికి ముప్పు పొంచి ఉంది. ఇక్కడ ఎలాంటి సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. తరచుగా జామ్ గ్రామానికి చెందిన పశువులు, ద్విచక్ర వాహనదారులు ఈ కాల్వలో పడిపోతుంటారు.

సమస్య పరిష్కరించాలి

లక్ష్మీనగర్, బోరింగ్ తండాకు వెళ్లే మార్గంలో ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. దీంతో రాత్రి ఈరెండు గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. మహవీర్‌తండాకు వెళ్లే దారిలోనూ వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– పవార్ రాజేశ్, సర్పంచ్, హనుమాన్‌తండా

ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలి..

మండలంలోని కల్వర్టులు, వంతెనల వద్ద ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తే తక్కువ వ్యయం అవుతుంది.. నిర్లక్ష్యంగా వదిలేస్తే ప్రజలు అసౌకర్యానికి గురవడమే కాక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు, పాలకులు స్పందించి శిథిలావస్థకు చేరిన వాటితోపాటు ప్రమాదకరంగా మారిన వంతెనలు, కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

తానూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 103 మంది హాజరవగా.. మరో 10 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. పరీక్షలు పూర్తయ్యే వరకు మండల కేంద్రంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై విక్రమ్ తెలిపారు.

సారంగపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 354 మందికి గాను 345 మంది పరీక్ష రాసినట్లు పరీక్షల చీఫ్ సూపరిటెండెంట్ మారుతి, డీవో బాపు తెలిపారు. తొలిరోజు పరీక్షా కేంద్రాన్ని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తనిఖీ చేశారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 113 మందికి గాను 105 మంది విద్యార్థులు పరీక్ష రాశారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ భోజారాం తెలిపారు. కార్యక్రమంలో డీవో బాలానంద్, అధ్యాపకులు ఉన్నారు.

కుంటాల: స్థానిక ఆదర్శ పాఠశాల 409 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 23 మంది గైరాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, డిపార్ట్‌మెంటల్ అధికారి సతీష్ తెలిపారు.



లోకేశ్వరంలో తనిఖీలు చేస్తున్న అధికారులు



కుంటాల: సూచనలు చేస్తున్న ఎస్ఓ సునీత

నర్సాపూర్(జి) కస్తూర్బా విద్యార్థినులకు ఎస్ఓ సునీత పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై సాయికిరణ్ పేర్కొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 365 మందికి గాను 339 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ హమీద్ తెలిపారు. ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలో 351 మందికి గాను 312 మంది హాజరవగా 39 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రమేశ్‌నాయక్ తెలిపారు.

దిలావర్‌పూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 249 మంది పరీక్షకు హాజరవగా 15 మంది గైర్హాజరయ్యారని కేంద్రం నిర్వహణాధికారి కందూరి శంకర్ అన్నారు. కేంద్రాన్ని తహసీల్దార్ కరీం, నిర్మల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ పరిశీలించారు.

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్షకు 237 మందికి గాను 231 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

ముధోల్: స్థానిక గురుకుల పాఠశాలలో 350 మందికి గాను 323 మంది పరీక్షకు హాజరైనట్లు డీవో హరిప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 335 మందికి గాను 310 మంది హాజరైనట్లు వారు పేర్కొన్నారు.

సాదాసీదాగా కుంటాల సర్వసభ్య సమావేశం

కుంటాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కుంటాల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ అధ్యక్షతన సాదాసీదాగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు, అధికారులు మాట్లాడారు.

- మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలల్లో పనులు చేపట్టడంతోపాటు సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నామని ఎంఈఓ ముత్యం తెలిపారు.
- మండలంలో 95శాతం మంది రైతులకు యాసంగి రైతుబంధు అందించామని.. నానో యూరియా వాడాలని ఏవో సోమలింగారెడ్డి సూచించారు.
- మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.74 లక్షల వడ్డీ లేని రుణాలు అందించామని ఏపీఎం భోజన్న తెలిపారు.
- కంటివెలుగు శిబిరంలో భాగంగా నాలుగు వేల మందికి కంటిఅద్దాలు పంపిణీ చేశామని వైద్యురాలు శృతి రెడ్డి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జారాం యాదవ్

- లింబా(బి), మెదన్‌పూర్ గ్రామాల్లో భగీరథ నీరు రావటం లేదని సర్పంచ్‌లు మల్లేశ్, చంద్రకాంత్‌పటేల్ సభ దృష్టికి తీసుకురాగా త్వరలో సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేస్తామని విద్యుత్ అధికారి నజీర్ తెలిపారు.
- అర్హులైన కూలీలకు వంద రోజుల పని కల్పిస్తామని ఏపీఓ నవీన్ తెలిపారు. పశువులకు లంపీస్కిన్ రాకుండా చర్యలు చేపడుతున్నామని.. ఇప్పటివరకు 15వేల పశువులకు నట్టల నివారణ మందు పంపిణీ చేశామని వైద్యాధికారి ప్రకాశ్ పేర్కొన్నారు.
- కల్లూరు పశువైద్యశాల శిథిలావస్థకు చేరిందని వైస్‌ఎంపీపీ మౌనిక తెలుపగా మరమ్మతులు చేయిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు.
- మండలంలోని గ్రామాల్లో రూ.2.45 కోట్ల వ్యయంతో 48 సీసీ రోడ్లు, మురికి కాల్వల పనులు కొనసాగుతున్నాయని పీఆర్ ఏఈ రఘువంశీ పేర్కొన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ పసుల మౌనిక, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ రహీం, ఆర్ఐ విజయ్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు పరిశీలన

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని మల్లన్నగుట్ట వద్ద నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కళాశాల ప్రిన్సిపాల్ జెవీడీఎస్ ప్రసాద్ పరిశీలించారు. ల్యాబ్‌లు, స్టాఫ్, తరగతి గదులు, వైద్య విద్యార్థుల కోసం నిర్మిస్తున్న వసతిగృహాల భవనాలను సందర్శించారు. ఈ సందర్భంగా వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. వారి వెంట జిల్లా ఆసుపత్రి ఆఫీసు సూపరింటెండెంట్ రఘునాథ్, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, రేడియోగ్రాఫర్ అబూ అమీర్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రసూతి ఆస్పత్రిని సందర్శించారు. ఈసందర్భంగా పర్యవేక్షకురాలు డాక్టర్ రజినీని ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ స్వర్ణ రెడ్డి, నర్సింగ్ సూపరిటెండెంట్ రాంబాయమ్మ, హెడ్‌నర్సు హేమలత సిబ్బంది ఉన్నారు.



ఆసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న ప్రిన్సిపాల్

స్వశక్తి కరణ్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

సారంగపూర్: బీజేపీ రాష్ట్రస్థాయి కమిటీ పిలుపు మేరకు ఈనెల 12న చేపట్టిన బూత్ స్వశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 25వరకు పూర్తి చేసి విజయవంతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ నాయుడి మురళీధర్ అన్నారు. మండలంలోని జామ్‌లో బూత్‌స్థాయి కమిటీల పనితీరు గమనించి నాయకులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు విలాస్, సోషల్ మీడియా కన్వీనర్ తిరుమలచారి, చందు, జీవన్, నరేందర్, తదితరులు ఉన్నారు.

పేపర్ లీకేజీపై విచారణ చేపట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న పోటీపరీక్షల ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. పేపర్ లీకేజీ ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి, అవినీతికి పాల్పడిన అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకుంటే టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి కిరణ్, రమేశ్, పృథ్వీరాజ్, అభిరామ్, శ్రీకాంత్, శ్రావణ్, ప్రసాద్, వెంకట్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్

ఖానాపూర్: ప్రజల్లో భద్రత, భరోసా కల్పించేందుకే ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఖానాపూర్ పోలీస్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని ఖానాపూర్ సీఐ నారాయణనాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట 99 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీకాంత్‌తో కలిసి నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో సీఐ పాల్గొన్నారు. ఎన్నికలకు సమయం దగ్గర ఉండడంతో శాంతిభద్రతలు అదుపులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అంతకుముందు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఫ్లాగ్‌మార్చ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సైలు శంకర్, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.



పాల్గొన్న అధికారులు

నేడు ప్రజావేదిక

మామడ: మండలంలో గతేడాది ఉపాధిహామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి గురువారం మామడ మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. వారం పాటు గ్రామాల్లో బృందం పరిశీలించిన పనులను వివరాలను ప్రజావేదికలో వివరిస్తారని పేర్కొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

భైంసాటౌన్: పట్టణంలోని డాక్టర్స్ అసోసియేషన్ భవనంలో సీపీఆర్‌పై శిక్షణ కొనసాగుతోంది. బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఇటీవలి కాలంలో గుండెపోటుతో హఠాన్మరణాలు ఎక్కువయ్యాయని, సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శిక్షకులు పేర్కొన్నారు. దీంతో కొన్ని మరణాలనైనా నిరోధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, ముష్కం రామకృష్ణగౌడ్, ముత్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

మజ్జిగ పంపిణీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్సు డిపోలో ఆర్టీసీ సిబ్బందికి బుధవారం డిపో మేనేజర్ సాయన్న మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్నందున నిత్యం మజ్జిగ పంపిణీ చేయాలని నిర్ణయించామని అన్నారు. కార్యక్రమంలో ఆన్ డ్యూటీ కంట్రోలర్లు రమేశ్, రాజేందర్, శేఖర్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

భైంసాటౌన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మురళి, కోఆర్డినేటర్ ప్రవీణ్ అన్నారు. గురువారం భైంసాలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు, తదితరులు ఉన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: బలగం

కాన్షీరాం జయంతి వేడుకలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కాన్షీరాం 89వ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించారు. బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ బహుజనులను చైతన్యపరిచి రాజ్యాధికారం ఎందుకు అవసరమో చాటిన గొప్ప వ్యక్తి కాన్షీరాం అని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ మహిళా జిల్లా కన్వీనర్ ఎస్కే లక్ష్మి, నిర్మల్ అసెంబ్లీ సెక్రెటరీ లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్, అసెంబ్లీ అధ్యక్షుడు కుక్కారికారి రాజేశ్, అసెంబ్లీ మహిళా కన్వీనర్ దాసరి హారతి, రాజన్న, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



ఖానాపూర్: పూలమాల వేస్తున్న బీఎస్పీ నేతలు

దశలవారీగా గ్రామాల అభివృద్ధి

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: దశల వారీగా సమస్యలను పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేస్తామని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఝరి(బి) గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. బుద్ధవిహార్ నిర్మాణానికి రూ.రెండు లక్షలు, అన్నబావు సాఠె కమిటీ భవనం నిర్మాణానికి రూ.రెండు లక్షలు, మజీద్ ప్రహరీ నిర్మాణానికి రూ.రెండు లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సత్వరం పనులు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, ఉత్తం బాలేరావ్, పోతారెడ్డి, కాశీనాథ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి..

ముధోల్: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వరమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు 38మందికి కల్యాణలక్ష్మి, ఆరుగురికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్, సర్పంచ్ రాజేందర్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు మాగ్దూమ్, పోతన్నయాదవ్, బాబన్న, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో బుధవారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాల్గొని పూజలు చేశారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, మంత్రి సోదరుడు సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ క్రిష్టారెడ్డి, గంగారాం, ముత్యం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లీగల్ ట్రైనింగ్‌లో పాల్గొన్న ఖానాపూర్‌వాసి

ఖానాపూర్: హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో జరిగిన లీగల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఖానాపూర్‌కు చెందిన న్యాయవిద్యార్థి నరేంద్రనాథ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యాయసేవలతోపాటు చట్టాల గురించి పారా లీగల్ వాలంటరీగా ప్రజలకు ఏలా అవగాహన కల్పించాలో నేర్చుకున్నట్లు తెలిపాడు. జైళ్లలో ఉంటున్న అండర్ ట్రయల్ ఖైదీల హక్కులపై ప్రజెంటేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నాడు.

కార్యవర్గం

భైంసాటౌన్: భైంసా పట్టణ స్వర్ణకార సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంఘ భవనంలో రాష్ట్ర కార్యవర్గ నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన రవీంద్రచారి, రంగు శ్రీనివాస్‌ను సభ్యులు అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మహేశ్, రాములు ఉన్నారు.

సమయం వృథా చేయొద్దు

దస్తురాబాద్: పదో తరగతి విద్యార్థులు సమయం వృథా చేయకుండా పట్టుదలతో చదివి మంచి పేరు తీసుకురావాలని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. బుధవారం మున్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ కిషన్, జెడ్పీటీసీ శారద, ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆటవస్తువులు పంపిణీ

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరేశ్‌కుమార్ బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా 40 మంది విద్యార్థులకు వివిధ రకాల ఆటవస్తువులను పంపిణీ చేశారు.